క్లుప్తంగా

ఘనంగా భాష్యం ఇన్‌స్టిట్యూషన్ వార్షికోత్సవం

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని భాష్యం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ పదో వార్షికోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ప్రణయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. అనుభవం కల్గిన ఉపాధ్యాయులతో బోధన తరగతులు నిర్వహిస్తున్న భాష్యం స్కూల్స్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, స్కూల్స్ జోనల్ ప్రిన్సిపల్ శిరీష, ప్రిన్సిపల్ ప్రియాంక, సాంబశివరెడ్డి, మురళీధర్‌యాదవ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేతల ఐక్యతతోనే బహుజన రాజ్యం

పిడమర్తి రవి

ఉస్మానియా యూనివర్సిటీ: బహుజనులకు రాజ్యాధికార ఆకాంక్ష ప్రతి కుటుంబంలో రావాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. బుధవారం ఓయూలో బీఎస్ఎఫ్ అధ్యక్షులు బొరెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్షీరాం జయంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాధికారం కొందరితో సాధ్యం కాదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలను పూలే, అంబేడ్కర్, కాన్షీరాం ఆలోచన విధానంతో చైతన్య పర్చాలన్నారు. రాజ్యాధికారానికి రానివ్వకుండా కొన్ని శక్తులు బహుజనుల గొంతు నొక్కేందుకు వ్యవహరిస్తున్నాయన్నారు. బహుజన రాజ్యం కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, డీఎస్పీ అధినేత విశారదన్ మహారాజ్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఇతర సంఘాల నేతలు ఏకం కావాలన్నారు. ఏప్రిల్ 3, 4 తేదీల్లో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ల కోసం చలో ఢిల్లీ, 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా బ్లూ మార్చ్, మే చివరి వారంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గాదె వెంకట్, చంద్రునాయక్, శ్రీకృష్ణ, ఎల్లన్న, బొట్టు శ్రీను పాల్గొని ప్రసంగించారు.

కేంద్రీయ ఉపకార వేతనాలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

గచ్చిబౌలి: కేంద్రీయ ఉపకార వేతనాల(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు కొండాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు అనంత రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 2022 డిసెంబర్ 18న ప్రవేశ పరీక్ష నిర్వహించింది. ఈ ప్రవేశ పరీక్షలో కొండాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు దిండి బిందు, వాసంశెట్టి జాహ్నవి దుర్గ, గుమ్మడవెల్లి శివ, ఎల్.కె.నవ్య శ్రీ, నాగేటి నతానేల్ జేదిద్య, ముంగ్యా అఖిల ప్రతిభ కనబరిచి స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు నెలకు రూ.వెయ్యి చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తుందని ప్రధాపోపాధ్యాయు లు తెలిపారు. ఆరు నెలల పాటు పక్కా ప్రణాళిక ప్రకారం శ్రమించి ప్రవేశ పరీక్ష రాశారని, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

'మనూ'లో దూరవిద్యలో డ్రాప్‌ఔట్లకు మళ్లీ అవకాశం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా విభాగంలో డ్రాప్‌ఔట్లకు మళ్లీ ప్రవేశం కల్పించాలని నిర్ణయించినట్లు 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ బుధవారం తెలిపారు. డీడీఈ ఆధ్వర్యంలో రీఅడ్మిషన్‌లను 2005 ఆతర్వాత బ్యాచ్‌లు, అంతే కాకుండా యూజీ , 2014 నుంచి వార్షిక మోడ్‌లో పీజీ ఫాలో–ఆన్–కోర్సులలో నమోదు కోసం ఫీజు చెల్లింపు పోర్టల్‌ను తెరిచిందన్నారు.

క్రైం కార్నర్..

మందలించారని విద్యార్థి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: బడి నుంచి ఆలస్యంగా వస్తున్నావని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపానికి గురైన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్బషీరాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం... సుభాష్‌నగర్ హనుమాన్ టెంపుల్ సమీపంలో ఉండే సుజిత్‌కుమార్ కుమారుడు స్థానికంగా ఉండే లిటిల్ స్టార్ హై స్కూల్ 8వ తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజు స్కూల్ నుంచి లేటుగా ఇంటికి వస్తున్నాడంతో కుటుంబ సభ్యులు మందలించారు. బుధవారం వరుసకు మామ అయ్యే వ్యక్తి సైతం సదరు విద్యార్థిని మందలించాడు. మనస్థాపానికి గురై గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గది తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని గాంధీకి తరలించారు.



హాల్ టికెట్ నంబర్ చూసుకుంటూ..

పరీక్ష కేంద్రం వద్ద గుమిగూడిన విద్యార్థుల తల్లిదండ్రులు





పరీక్ష కేంద్రం బయట విద్యార్థుల తల్లిదండ్రులు

ఇంటర్ మొదటి పరీక్ష ప్రశాంతం

ఇంటర్ మొదటి పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పరీక్ష కేంద్రాలకు ఉదయం 9గంటల నిబంధన అమలులో ఉండటంతో ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకున్నారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు చింతల్, షాపూర్‌నగర్, కొంపల్లి, నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లోని కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు పడిగాపులు కాస్తూ కనిపించారు. మొత్తానికి మొదటి రోజు పరీక్ష సజావుగా కొనసాగడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

– కుత్బుల్లాపూర్

సమస్యలను పరిష్కరించే దిశగా పని చేస్తున్నాం



ప్రగతియాత్ర చేపడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న కాలనీవాసులు

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా బుధవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్, వాణినగర్, ఇంద్రసింగ్ నగర్ తదితర ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, వర్షపునీటి నాలా, ఖాళీ స్థలాల్లో కమిటీహాళ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గడిచిన తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి వేగం పుంజుకుందన్నారు. సీఎం కేసీఆర్, పురపాలక శాఖమంత్రి కేటీఆర్‌లు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా కల్పిస్తూ యాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, నియోజకవర్గ బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ సోమేష్ యాదవ్, డివిజన్ బీఆర్‌ఎస్ సెక్రటరీ సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్‌చారి, కాలనీ అధ్యక్షులు నాగదీప్‌గౌడ్, మధుకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లిలో ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన సీపీఐ నేతలు

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాలను కాపాడాలని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ బుధవారం బాచుపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... సర్వే నం.87, 90, 94, 95, 182, 191, 233, 322లలో ఎన్ని ఫిర్యాదులు చేసినా విచారణ చేయడం లేదన్నారు. అదే విధంగా ప్రైవేటు స్థలాల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలను సర్వేయర్ శ్రీనాథ్ ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా సర్వే చేసి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడానికి ముఖ్య కారణమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు వీటిపై పూర్తి విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అశి యాదయ్య, శివకుమార్‌రెడ్డి, కీర్తిబాబు, డిల్లీశ్వర్ రావు తదితరలు పాల్గొన్నారు.

వేగవంతంగా జీఓ.59 రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

తహసీల్దార్ సంజీవరావు

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు జీఓ.59 కింద డిమాండ్ నోటీసులు అందుకుని నిర్దేశించిన రుసుంను ఏక కాలంలో చెల్లించిన వారికి బుధవారం మొదటి పదిమందికి రిజిస్ట్రేషన్లు జరిగాయని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు తెలిపారు. మండలంలో జీఓ.59 కింద 14,518 దరఖాస్తులు వచ్చాయన్నారు. 3100 దరఖాస్తులకు కలెక్టర్ అప్రూవల్ ఇచ్చారని పేర్కొన్నారు. అందులో మొదటి విడతగా 406 రుసుం చెల్లించారన్నారు. 248 మంది పూర్తి డబ్బులు చెల్లించారని తెలిపారు. పూర్తి డబ్బులు చెల్లించిన వారికి మెసేజ్ లేదా తమ కార్యాలయం నుంచి సిబ్బంది ఫోన్ చేస్తారని వెల్లడించారు. ఇక నుంచి వేగవంతంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ రోజువారీగా కొనసాగుతుందన్నారు. కొన్ని ప్రాంతాలలో కంప్యూటర్ సమస్యతో ఎక్కువ కట్టాలని వచ్చిందని అలాంటి పేర్లను కలెక్టర్ కార్యాలయానికి పంపామని పేర్కొన్నారు. డిమాండ్ నోటీసులు అందుకున్న దరఖాస్తుదారులు పూర్తి పేమెంట్ చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.



రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న జీఓ.59 దరఖాస్తుదారులు

ఓయూలో కాన్షీరాం జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షీరాం 89వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కాన్షీరాం చిత్రపటానికి పొలిటికల్ సైన్స్ విభాగం హెడ్ ప్రొ.చంద్రునాయక్ నివాళి అర్పించి బహుజన రాజ్యాధికారం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంజయ్, తిరుపతి, రాముయాదవ్, వెంకన్నగౌడ్, కిషన్‌నాయక్, అంజి, సత్యం, ఆనంద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆట పాటలతో అదరగొట్టిన మహిళలు

సర్కిల్ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న డీసీలు మంగతాయారు, ప్రశాంతి



మహిళల నృత్య ప్రదర్శన

కుత్బుల్లాపూర్: ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో చివరి రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. అదే విధంగా కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, పాటలు తదితర పోటీల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి ఉప కమిషనర్లు మంగతాయారు, ప్రశాంతి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జంట సర్కిళ్ల ప్రాజెక్టు అధికారి హరిప్రియ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సమైక్య మహిళా గ్రూపు సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సైన్స్ మహాసభ విజయవంతం

ఉస్మానియా యూనివర్సిటీ: బ్రేక్ త్రు సైన్స్ సొసైటీ తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో ఓయూలో నిర్వహించిన సైన్స్ మొదటి మహాసభ విజయవంతమైందని స్టేట్ చాప్టర్ ప్రతినిధి ఎ.ప్రతిభ తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీలోని 57వ తరగతి గదిలో జరిగిన మహాసభకు వివిధ సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొని ప్రసంగించారు.

- ఈ సందర్భంగా బ్రేక్ త్రు సైన్స్ సొసైటీ తెలంగాణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు డా.గంగాధర్, ఉపాధ్యక్షులు దేవర్షి గంగాజీ, డా.వికాస్ శర్మ, డా.నతనియల్, కార్యదర్శిగా శరత్, కోశాధికారిగా ఉషాకిరణ్, ఆఫీస్ సెక్రటరీగా సాయికుమార్ ఎంపికయ్యారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న గొల్లజాన్

జీడిమెట్ల: రోజురోజుకి ఎండలు పెరుగుతున్నాయని.. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్ఎస్‌యూఐ నాయకుడు గొల్లజాన్ కోరారు. బుధవారం ఆయన గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన డీసీ సర్వే నిర్వహించి అవసరం ఉన్న ప్రాంతంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



దుండిగల్: కంటివెలుగు రెండో విడత కార్యక్రమాన్ని దుండిగల్ వైస్‌చైర్మన్ తుడుము పద్మారావు బుధవారం ప్రారంభించారు. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని 14వ డబుల్ బెడ్‌రూమ్ వద్ద కంటి వెలుగు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవడానికి అర్హులన్నారు. పరీక్షలకు వెళ్లే ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డులు తీసుకుని వెళ్లాలని ఆయన సూచించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు, కౌన్సిలర్ సత్యనారాయణ, రెవెన్యూ అధికారి శ్రీహరిరాజు, వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీలో జరిగిన ఘటనపై ఓయూలో నిరుద్యోగులు, విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. బుధవారం నవ తెలంగాణ స్టూడెంట్ యూనియన్ (ఎన్‌టీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు భారీ ర్యాలీ చేపట్టి రోడ్డుపై ధర్నా చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న వారిని అరెస్ట్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, జాతీయ నాయకులు నాగేశ్వర్‌రావు మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తొలగించి, సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం

సుభాష్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని సుభాష్‌నగర్ కార్పొరేటర్ హేమలత అన్నారు. బుధవారం ఒంటిపూట తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో సూరారం కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, వసతులు తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం లేకుండా చూడాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు.



పాఠశాలను సందర్శించిన అనంతరం పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్

జీఓ.58, 59 సందేహాలపై తహసీల్దార్ క్లారిటీ



తహసీల్దార్ సురేందర్

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమిత నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీఓ.58, 59ను తీసుకొచ్చి ఇంటిపై హక్కులు కల్పించే వెసులుబాటును కల్పించిన విషయం తెలిసిందే. అయితే జీఓ.58 ద్వారా ఉచితంగా పట్టాలు పంపిణీ చేస్తుండగా... జీఓ.59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇప్పటికే అధికారులు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై నోటీసులు అందుకున్న వారికి ఎన్నో సందేహాలు ఉన్నాయి. ఆ సందేహాలను నివృత్తి చేయడానికి బాచుపల్లి తహసీల్దార్ సురేందర్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: జీఓ.59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి చాలా మందికి 125 గజాల లోపు ఉన్న వారికి బేసిక్ వ్యాల్యూలో 25 శాతం కంటే ఎక్కువ డబ్బులు చెల్లించాలని నోటీసులు వచ్చాయి. దీనిపై మీ సమాధానం.

జవాబు: ఎవరికీ డబ్బులు ఎక్కువగా రాలేదు. 125గజాల ఇంటి స్థలంలో 40గజాల్లోనే ఇంటిని నిర్మించుకుంటే దానికి 25 శాతం. మిగత ఖాళీ స్థలానికి 100 శాతం చెల్లించాలని వేశారు. అంతే కాని ఎవరికీ ఎక్కువగా చెల్లించాలని నోటీసులు ఇవ్వలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నోటీసులు వచ్చాయి.

ప్రశ్న: గతంలో డిమాండ్ నోటీసుల్లో లక్షల్లో చెల్లించాలని వచ్చింది. దీనిపై లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాంటివి ఏమైన తగ్గించే అవకాశం ఉందా?

జవాబు: ఈ ప్రక్రియ అంతా కంప్యూటర్ జనరేటెడ్ పద్ధతి జరుగుతుంది. దీనిలో మేము ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. ప్రభుత్వం నుంచి కూడా ఈ విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు లేవు. నోటీసులు వచ్చిన వారు సకాలంలో డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరుతున్నాం.

ప్రశ్న: జీఓ.59 కింద డబ్బులు చెల్లించడానికి ఆశించిన స్థాయిలో లబ్ధిదారుల నుంచి స్పందన ఉందా.? ఇప్పటి వరకు ఉన్న పరిస్థితి ఏంటి?

జవాబు: అలాంటిదేమీ లేదు. లబ్ధిదారుల నుంచి మంచి స్పందన ఉంది. వందలాది మంది 50శాతం వరకు డబ్బులు చెల్లించారు. ఇప్పటికి బాచుపల్లి మండలంలో 100 మందికి పైగా పూర్తిస్థాయి డబ్బులు చెల్లించారు. వారికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లు కూడా చేస్తున్నాం.

ప్రశ్న: డబ్బులు కట్టిన వారికి సకాలంలో రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మీ సమాధానం?

జవాబు: ఇది వాస్తవం కాదు. కన్వీనియన్స్ డీడ్‌లు తీసే క్రమంలో కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నప్పుడు కొంత అలస్యం అవుతోంది. గతంలో క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేస్తున్నప్పుడు యాప్‌లో వివరాలు పొందుపరిచే క్రమంలో జరిగిన పొరపాట్ల వల్ల సమస్యలు వస్తున్నాయి. వీటిని జిల్లా కలెక్టర్‌కు నివేదించి వేగవంతంగా పరిష్కరించి వాటిని రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం.

ప్రశ్న: డిమాండ్ నోటీసుల్లో వచ్చిన మొత్తం డబ్బులు ఒకేసారి చెల్లించే వారికి మొత్తంలో ఏమైన తగ్గించే అవకాశం ఉందా?

జవాబు: మొత్తం డబ్బులు చెల్లించే వారికి 5శాతం రిబేట్ ఇచ్చే అవకాశం ఉంది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే మౌఖిక ఆదేశాలు కూడా ఇచ్చింది. దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవచ్చు.

ప్రశ్న: ఇటీవల ప్రభుత్వం 2020 వరకు సైతం ప్రభుత్వ స్థలాల్లో అక్రమిత నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు మరో నెల రోజులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. కాని మీ–సేవలో దరఖాస్తులు తీసుకోవడం లేదు ఎందుకు.?

జవాబు: వాస్తవమే. గతంలో 2014 జూన్ 2 వరకు ఉన్న నిర్మాణాలకు మాత్రమే అవకాశం ఉండే. కాని ప్రస్తుతం 2020 వరకు నిర్మాణాలు ఉన్న వారికి సైతం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. కాని దీనికి సంబంధించి విధివిధానాలు రాలేదు. త్వరలోనే వస్తుందనే సమాచారం ఉంది. వచ్చిన తరువాత అవసరం ఉన్న వారు మీ–సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఓ వైపు హర్షం... మరోవైపు ఆగ్రహం

- ఓ కాలనీలో సీసీరోడ్డు పనులు పూర్తి
- మరో కాలనీలో ఆరు నెలలుగా పెండింగ్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్‌లో ఓ కాలనీ ప్రజలు సీసీ రోడ్డు వేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తుంటే... మరో కాలనీలో అధికారులు రోడ్డు వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంజయ్యనగర్ రోడ్‌నం.1లో రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో అధికారులు సీసీ రోడ్డును నిర్మించారు. కూన మహాలక్ష్మినగర్‌లో సీసీ రోడ్డు నిమిత్తం భూగర్భ డ్రైనేజీ పనులను 6నెలల ముందుగానే పూర్తి చేసిన అధికారులు సీసీ రోడ్డు మాత్రం వేయడం లేదు. దీంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని కూన మహాలక్ష్మినగర్‌లో వెంటనే సీసీరోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



అంజయ్యనగర్ నిర్మించిన సీసీ రోడ్డు



కూన మహాలక్ష్మినగర్‌లో చేపట్టని రోడ్డు పనులు

వారానికోసారి ఫాగింగ్ చేయాలి

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్‌లో ఎంటమాలజీ సిబ్బంది ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. వెంకటాద్రినగర్, సుభాష్‌నగర్, ఎస్‌ఆర్‌నాయక్‌నగర్, అపురూపాకాలనీ, ప్రశాంత్‌నగర్, కాలనీల్లో ఇటీవల దోమల బెడద ఎక్కువగా ఉందంటున్నారు. కనీసం 15రోజులకు ఒకసారి ఎంటమాలజీ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించాలని కాని దీనికి విరుద్ధంగా నెల రోజులుగా ఒకసారి కూడా ఫాగింగ్ చేయడం లేదన్నారు. ప్రతి సంవత్సరం కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీలో ప్రభుత్వం దోమల నివారణకు లక్షల రూపాయలు వెచ్చిస్తున్నా ఎంటమాలజీ అధికారులు సరిగా వినియోగించడం లేదన్నారు. ఇప్పటికైనా కాలనీల్లో వారానికి ఒకసారైనా ఫాగింగ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్లపై మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోండి

జీడిమెట్ల: రోడ్లపై మద్యం తాగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మోడీ అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులను కోరుతున్నారు. మోడీ అపార్ట్‌మెంట్ వెనుక గేటు సమీపంలోని కొంపల్లి ఫార్మా పరిశ్రమ పార్కింగ్ షెడ్డులో ప్రతిరోజు కొంతమంది యువకులు రాత్రి సమయం మద్యం తాగుతున్నారని తెలిపారు. మద్యం తాగుతున్న వారిని చూసి మహిళలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. అయినప్పటికీ రోడ్డు పక్కల మద్యం తాగడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై జీడిమెట్ల పోలీసులు పట్టించుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లవ్ ఫెయిల్.. రెండేళ్లుగా మద్యానికి బానిసై.!

- ఈనెల 13న బిల్డింగ్‌పై నుంచి దూకిన యువకుడు
- చికిత్స పొందుతూ మృతి
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

జీడిమెట్ల: అప్పట్లో అతడి వయస్సు 17 సంవత్సరాలు. మైనర్ వయస్సులోనే ఓ మైనర్ (బాలిక)ను ప్రేమించాడు. బాలిక దక్కలేదని రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంటిపై మూడు రోజుల క్రితం బిల్డింగ్‌పై నుంచి కిందకు దూకాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

- ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్‌నగర్ న్యూఎస్‌ఎల్‌బీ నగర్‌కు చెందిన జగన్‌కుమార్‌కు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమార్తెలు కాగా ఒక అబ్బాయి మణికళ్యాణ్(19). మణికళ్యాణ్ ఇంటర్ మొదటి సంవత్సరం చదివే క్రమంలో అదే కాలనీకి చెందిన ఓ బాలికను ప్రేమించాడు. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో బాలిక తల్లిదండ్రులు ఆమెను తీసుకుని వారి సొంతప్రాంతం కర్ణాటకకు వెళ్లారు. దీంతో అప్పటి నుంచి మణికళ్యాణ్ మద్యానికి బానిసయ్యాడు. రాత్రిపూట మద్యం సేవించి ఇంటికొచ్చి ప్రేమించిన అమ్మాయి కావాలంటూ గొడవపడేవాడు.
- ఈనెల 13వ తేదీన మద్యం సేవించి ఇంటికి వచ్చిన మణికళ్యాణ్ రాత్రి 12గంటల సమయంలో బిల్డింగ్‌పై నుంచి కిందకు దుకాడు. తీవ్ర గాయాల అవ్వడంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మణికళ్యాణ్‌ను ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మణికళ్యాణ్ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: ఓ నవజాత శిశువు మృతదేహం లభించిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్రలోని తేజ వైన్స్ వెనుక గల్లీలో బుధవారం ఉదయం 9గంటల సమయంలో అటుగా వెళ్తున్న మల్లేష్‌యాదవ్, గంగా భవానీలకు నవజాత మృత శిశువు కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టు పక్కల విచారించగా ఆచూకీ తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల అయోధ్యనగర్‌లోని ఓ ఇంటి పై కప్పు రేకులపై గుర్తు తెలియని వ్యక్తులు శిశువును వదిలి పెట్టి వెళ్లిపోయిన ఘటన మరువక ముందే ఈ ఘటన జరగడం గమనార్హం.